క్లుప్తంగా

కమనీయం శ్రీనివాసుని కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

బద్వేలు అర్బన్ : స్థానిక సిద్దవటంరోడ్డులోని శ్రీమహాలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయంలో పద్మావతి, గోదాదేవి వేంకటేశ్వరస్వామిల కల్యాణం కమనీయంగా సాగింది. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని గరుడ వాహనంపై కొలువు దీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

కోదండరామాలయానికి రూ.2లక్షలు విరాళం



ఆలయ నిర్వాహకులకు విరాళం అందిస్తున్న ఎమ్మెల్సీ రమేష్ యాదవ్

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీరాములపేటలోని ఎమ్మెల్సీ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్ నెల్లూరు జిల్లా అనంతసాగరం ఏకర్లపాడులో నిర్మిస్తున్న శ్రీ కోదండ రామాలయానికి గ్రానైట్ చపట కోసం రూ.2 లక్షలను ఆలయ నిర్వాహకులకు అందజేశారు. మాజీ మంత్రి దివంగత మేకపాటి గౌతంరెడ్డి, తన తండ్రి మాజీ మున్సిపల్ చైర్మన్ ఆర్.వెంకటసుబ్బయ్య జ్ఞాపకార్థం ఆలయానికి ఈ విరాళం అందించినట్లు ఎమ్మెల్సీ తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మురళీధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కల్లూరు ప్రసాదరెడ్డి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు భూమి పూజ



మాట్లాడుతున్న శివచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీ అమృతానగర్‌లో బుధవారం సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో అమృతానగర్ నిర్మించారని ఇక్కడి ప్రజలు రొడ్లు సరిగా లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. దీంతో పంచాయతీ జనరల్ ఫండ్ ద్వారా రూ.40లక్షలు కేటాయించి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ భాగ్యమ్మ, వార్డుమెంబర్ మోషే తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవా పురస్కారం

మైదుకూరు : ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా కడపలోని రెడ్ క్రాస్ సొసైటీ మైదుకూరుకు చెందిన అమ్మ సేవా సమితి అధ్యక్షుడు వి.శివశంకర్‌ను బుధవారం ఉత్తమ సేవా పురస్కారంతో సత్కరించింది. యువకులకు రక్తదానంపై అవగాహన కల్పిస్తూ రక్తదానం చేసేలా ప్రోత్సహించడం, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న శివశంకర్‌ను ఆర్డీఓ ధర్మ చంద్రారెడ్డి, అదనపు డీఎంహెచ్ఓ ఖాదర్‌వలి, నెహ్రూ యువకేంద్రం జిల్లా కోఆర్డినేటర్ మణికంతలు శాలువా, జ్ఞాపిక, సర్టిఫికెట్‌తో సత్కరించారు. రెడ్ క్రాస్ సొసైటీ ప్రత్యేక అధికారి సాయిగ్రేస్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సు

చాపాడు : సీబీఐటీలో బుధవారం జాతీయ విద్యా విధానంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో మొదటి సంవత్సరం ఎంబీఏ, బీటెక్ విద్యార్థులు పాల్గొన్నారు. ఇదే క్రమంలో విద్యార్థులకు జీ–20 సమ్మిట్‌పై అవగాహన కల్పించారు. దీనిపై నిర్వహించిన వ్యాస రచన పోటీలలో 232 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సీఎస్‌సీకి చెందిన జి.వాణి ప్రథమ, ఈసీఈ విద్యార్థిని వి.సంధ్య ద్వితీయ, వై.శ్వేత తృతీయ స్థానంలో నిలిచారు. బహుమతులను ప్రిన్సిపాల్ డా.జి.శ్రీనివాసులరెడ్డి, అధ్యాపకులు పంపిణీ చేశారు.

తహసీల్దార్‌కు వినతి

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యాహక్కు చట్టం ప్రకారం ఫ్రీ సీట్ల విధానం ప్రతి తరగతి విద్యార్థులకు కేటాయించాలని, గత బెస్ట్ అవైలబుల్ స్కీంను కొనసాగించాలని పీడీఎస్ఓ నాయకులు బుధవారం తహసీల్దార్ నజీర్ అహ్మద్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పీడీఎస్ఓ రాయలసీమ కన్వీనర్ ఓబులేసు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 1వ తరగతికి ఫ్రీ సీట్ల విధానాన్ని పీడీఎస్ఓ స్వాగతిస్తోందన్నారు.

దీని వల్ల 2 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులు ఫ్రీ సీట్లు కోల్పోతారన్నారు. విద్యాహక్కు చట్ట ప్రకారం ఉచిత విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రతి కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలో ఉచిత విద్యను కల్పించాలన్నారు. పీడీఎస్ఓ నాయకులు బయన్న, అష్ఫల్ పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను ఆదరించండి.. ఆశీర్వదించండి

- మాట ఇచ్చి నెరవేర్చిన నాయకుడు వైఎస్ జగన్
- నమ్మించి మోసం చేసే బుద్ధి చంద్రబాబుది
- గడపగడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

మైదుకూరు : అభివృద్ధి, సంక్షేమం జోడు గుర్రాలుగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకుపోతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అందరూ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని నంద్యాలంపేట పంచాయతీ శ్రీరామ్‌నగర్, భాగ్యనగరం గ్రామాల్లో గడపగడపకు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. రెండు గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని ప్రజలకు ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2014 ఎన్నికలకు ముందు చంద్రబాబు డ్వాక్రా మహిళలకు రుణాలను మాఫీ చేస్తామన్నారన్నారు. రైతులు బ్యాంకుల్లో తనఖా పెట్టిన బంగారాన్ని విడిపించి పువ్వుల్లో పెట్టి అందిస్తామని హామీ ఇచ్చి వారిని మోసం చేశాడన్నారు. అధికారంలోకి రాగానే డ్వాక్రా మహిళలకు, రైతులను చంద్రబాబు మోసం చేశాడని ఆరోపించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో డ్వాక్రా మహిళల రుణాలను మాఫీ చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ బ్యాంకు రుణాలను వడ్డీతో సహా చెల్లిస్తున్నారని అన్నారు. రైతులకు ఏడాదికి రూ.13,500 పెట్టుబడి సాయం రైతు భరోసా కింద అందిస్తూ ఆదుకుంటున్నారని కొనియాడారు. ఇల్లులేని పేదలకు ఇంటి స్థలం, పక్కా ఇల్లు కూడా మహిళ పేరుతోనే మంజూరు చేస్తున్నారని అన్నారు. అడిగినవి, అడగనివి అన్నీ ఇస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను అన్ని వర్గాల వారు ఆదరించి ఆశీర్వదించాలని రఘురామిరెడ్డి కోరారు.

డ్రైనేజీ సమస్య తీరుస్తాం

తెలుగు గంగ ప్రాజెక్టు ముంపు కాలనీ అయిన శ్రీరామ్ నగర్‌లో డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కాలనీలో పునరావాసం, సౌకర్యాల కల్పన కింద భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేశారు. పూడిక కారణంగా డ్రైనేజీల్లో మురికి నీరు నిలిచిపోయిందని దుర్గంధంతోపాటు వీధుల్లోకి ప్రవహిస్తున్నాయని కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఆయన స్పందిస్తూ డ్రైనేజీల క్లియరెన్స్ కోసం అవసరమైన యంత్ర పరికరాలను తెప్పించి సమస్యను వారంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. భాగ్యనగరంలో విద్యుత్ స్తంభాలు దెబ్బతిని కూలేందుకు సిద్ధంగా ఉన్నాయని గ్రామస్తులు చెప్పగా, వెంటనే స్తంభాలను మార్చాలని అక్కడే ఉన్న ట్రాన్స్‌కో ఏఈ రామభద్రయ్యకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, ఎంపీపీ థామస్, వైస్ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఏవీ సుబ్బారెడ్డి, మండల కన్వీనర్ గల్లా నరసింహారెడ్డి, ఎంఎస్‌ఆర్, వేణుగోపాల్‌రెడ్డి, సుబ్బిరెడ్డి, రామశివారెడ్డి, సుబ్బారెడ్డి, ఎల్లారెడ్డి, తువ్వపల్లె వెంకటసుబ్బయ్య, మండల కోఆప్షన్ సభ్యుడు ఇంతియాజ్ బాషా, ఎల్లయ్య, నానుబాల వెంకటసుబ్బయ్య, మార్కెట్ కమిటీ రవి, అధికారులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ

మండలంలోని జీవీ సత్రం రైతు భరోసా కేంద్రంలో బుధవారం పచ్చి రొట్ట ఎరువుల విత్తనాలను ఎమ్మెల్యే రఘురామిరెడ్డి రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ రైతుల కోసం ఆర్బీకేలు ఏర్పాటు చేసి నాణ్యమైన విత్తనాలు, ఎరువులను అందిస్తున్నారన్నారు. రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల వ్యవసాయాధికారి పి.లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ మైదుకూరు మండలానికి 270 క్వింటాళ్ల జీలుగలు, 40 క్వింటాళ్ల జనుము విత్తనాలు మంజూరయ్యాయని తెలిపారు. నంద్యాలంపేట పంచాయతీలో సచివాలయం 1, 2 పరిధిలో 250 మంది రైతులు పచ్చిరొట్ట ఎరువుల విత్తనాల కోసం తమ పేర్లను నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు.

కల్యాణం.. కమనీయం



స్వాములకు కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు

రాజుపాళెం : మండలంలోని కొర్రపాడు గ్రామ సమీపంలోని నల్లవాగు వద్ద వెలసిన శ్రీకంబగిరి లక్ష్మీనరసింహా స్వామి ఆలయంలో బుధవారం కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. కంబగిరి లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మి, సిద్ధి లక్ష్మి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పేరుసోముల రామమోహన్ ఆధ్వర్యంలో కల్యాణోత్సవం నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల పూలమాలలు, పెళ్లి బాసికలను వేద పండితులు తలపై ఉంచుకుని నృత్యం చేస్తూ పరిణయ ఉత్సవాన్ని వేదమంత్రాలతో జరిపించారు. ఆలయ అర్చకులు ఓబులేసు స్వామితోపాటు దొంతిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, పెద్ద సంఖ్యలో ప్రజలు కల్యాణోత్సవాన్ని తిలకించారు. అక్కడికి వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

పేదల కడుపు నింపేందుకే రాజన్న భోజనం



రాచమల్లు వారి రాజన్న భోజనం వంట శాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : పేదల కడుపు నింపాలన్న లక్ష్యంతోనే రోజూ ఉచితంగా వేలాది మందికి రాచమల్లు వారి రాజన్న భోజనం కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో నూతనంగా నిర్మించిన వంట శాలను బుధవారం వేద పండితులు పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 25 ఏళ్లుగా తాను పేదల కోసం అనేక రకాల సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నానని అన్నారు. అందులో భాగంగానే అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించాలని అనుకున్నామన్నారు. ఈనెలాఖరులోపు మంత్రులచే కొర్రపాడు రోడ్డులోని ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహం వద్ద ఉచిత భోజన కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శులు పోరెడ్డి నరసింహారెడ్డి, లక్కిరెడ్డి పవన్‌రెడ్డి, ఆర్‌పీసీపీ మెంబర్ కాకర్ల నాగశేషారెడ్డి, వార్డు కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి, ఎంపీపీ శేఖర్ యాదవ్, ఫారెస్ట్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ సానపురెడ్డి ప్రతాప్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షులు కామిశెట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆటో నగర్‌ను అందంగా తయారు చేస్తాం

మండలంలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీలో ఉన్న ఆటో నగర్‌లో సిమెంటు రోడ్డు, డ్రైనేజి కాలువలను నిర్మించి అందంగా తయారు చేస్తామని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. రూ.2.60 కోట్లతో నిర్మించనున్న సిమెంటు రోడ్లు, డ్రైనేజి కాలువల నిర్మాణానికి ఎమ్మెల్యే బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 ఎన్నికల సందర్భంగానే ఆటో నగర్‌ను అభివృద్ధి చేస్తానని తెలిపానని, తమ ప్రభుత్వం అధికారంలో లేకపోవడంతో చేయలేదన్నారు. గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు అమృతానగర్ అభివృద్ధికి చర్యలు చేపట్టామన్నారు. దాదాపు 1000 మీటర్ల పరిధిలో రోడ్లు, కాలువలు నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, టీటీడీ పాలకమండలి సభ్యుడు టంగుటూరు మారుతిప్రసాద్, ఆటో నగర్ అసోసియేషన్ అధ్యక్షుడు నన్నేసాహెబ్, బాలయ్య, మాజీ సర్పంచ్ గురుస్వామి, వార్డు మెంబర్ లక్ష్మీనారాయణరెడ్డి, ఏఎస్ రాజా, టౌన్ బ్యాంకు డైరెక్టర్ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలను కాపాడుతున్న రక్తదాతలు



రక్తదాత రామకృష్ణారెడ్డిని సన్మానిస్తున్న వైద్యాధికారులు



రక్తదానం చేస్తున్న బి.కోడూరు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది



రక్తదానం చేసిన యువతతో వైద్య బృందం

ప్రొద్దుటూరు క్రైం : రక్తదాతలు ఎంతో మంది ప్రాణాలను కాపాడుతున్నారని డిప్యూటీ డీఎంహెచ్ఓ శాంతికళ తెలిపారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా జిల్లా ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంక్‌లో బుధవారం పట్టణంలోని పలువురు రక్తదాతలను సన్మానించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్ఓ మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఎలాంటి ఖర్చు కాదని, పైగా ఒకరి జీవితాన్ని కాపాడేవాళ్లవుతారని చెప్పారు. మన ప్రాణమంతా రక్తంలోనే ఉందన్నారు. రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఆమె పిలుపునిచ్చారు. జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబు మాట్లాడుతూ ఆస్పత్రిలోని బ్లడ్‌బ్యాంక్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. త్వరలోనే రక్తం నుంచి ప్లేట్‌లెట్స్, ఎర్రరక్త కణాలను వేరు చేసే ప్రక్రియను ప్రారంభించనున్నట్లు తెలిపారు. బ్లడ్ బ్యాంక్ డాక్టర్ కవిత, నర్సింగ్ సూపరింటెండెంట్ రాణమ్మ, రక్తదాతలు మల్లికార్జున, సిరాజ్, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కామనూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో

మండలంలోని కామనూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వైద్యులు హనీఫ్‌బాబా, శ్రీనివాసులు రక్తదానం ఆవశ్యకత గురించి వివరించారు. హెల్త్ ఎడ్యుకేటర్ శోభారాణి, సూపర్ వైజర్ బీప వరప్రసాద్, చంద్రకళ, ఫార్మసిస్టు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

రక్తదాతల దినోత్సవం సందర్భంగా సురక్ష బ్లడ్ బ్యాంక్‌లో ప్రొద్దుటూరు బ్లడ్ డొనేట్ గ్రూప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు యువకులు రక్తదానం చేశారు. బ్లడ్ డొనేట్ గ్రూప్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు షేక్ మున్నా, ఉపాధ్యక్షుడు లేపాక్షి వీరవర్ధన్, డేవిడ్ రాజ్, ఆర్నాల్డ్ జిమ్ న్యామతుల్లా, షేక్ జిలాని పాల్గొన్నారు.

రక్తదానం చేసిన వైద్య సిబ్బంది

బి.కోడూరు : ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా బుధవారం బద్వేలు ప్రభుత్వాసుపత్రిలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ వై.చంద్రహాసరెడ్డి, హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాంప్రసాద్ పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది రక్తదానం చేసినట్లు వైద్యాధికారులు డాక్టర్ వినీత్ కుమార్‌రాజు, డాక్టర్ ఉదయ్‌కిరణ్‌లు తెలిపారు. బి.కోడూరు పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ విలియం, సీహెచ్ఓలు అర్చన, దేవిక, సోమి, రోహిణి, సచివాలయ ఏఎన్‌ఎం కుమారిలు రక్తదానం చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ఆరోగ్య పర్యవేక్షకులు విలియంకు బి.కోడూరు వైద్యాధికారులు అభినందనలు తెలిపారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలువాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : అన్నిదానాల్లో కంటే రక్తదానం గొప్ప కార్యక్రమమని, రక్తదానం చేసి ప్రతి ఒక్కరూ ప్రాణదాతలుగా నిలవాలని డిప్యూటీ వైద్యాధికారి చంద్రహాసరెడ్డి, సూపరింటెండెంట్ రాంప్రసాద్ తెలిపారు. బుధవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవ సందర్భంగా బద్వేలు కమ్యూనిటీ హాస్పిటల్‌లో రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానం వల్ల అనేక ప్రాణాలను రక్షించిన వారవుతారన్నారు. ఈ కార్యక్రమంలో బి.కోడూరు పీహెచ్‌సీ పర్యవేక్షకులు విలియం, వైద్యాధికారులు వినీత్‌కుమార్‌రాజు, ఉదయ్ కిరణ్, హెల్త్ సూపర్‌వైజర్ విలియం, సీహెచ్ఓలు అర్చన, దేవిక, రోహిణి, ఏఎన్‌ఎం కుమారి పాల్గొని రక్తదానం చేశారు.

విద్యా కానుక పంపిణీ



జగనన్న విద్యాకానుక కిట్లను అందిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారు మునిరెడ్డి

ప్రొద్దుటూరు : గతంలో ఏ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇలాంటి విద్యాకానుక కిట్లను అందించలేదని మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి తెలిపారు. అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు బుధవారం ఆయన విద్యాకానుక కిట్లను అందించారు. ఈ సందర్భంగా బంగారు మునిరెడ్డి మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు, షూ, టై, బెల్ట్ అందించారన్నారు. పిల్లలను బడికి పంపితే తల్లుల ఖాతాల్లో జగనన్న అమ్మఒడి ద్వారా ఏటా రూ.15వేలు అందిస్తున్నారన్నారు. కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు కసిరెడ్డి మహేశ్వరరెడ్డి, గురునాథ్‌రెడ్డి, హెడ్మాస్టర్ గుర్రప్ప పాల్గొన్నారు.

దువ్వూరు : మండలంలోని చిన్నబాకరాపురంలో ఎంపీపీ పాఠశాలలోని 30 మంది విద్యార్థులకు బుధవారం సర్పంచ్ మంచాల రాజగోపాల్‌రెడ్డి జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉప సర్పంచ్ విజయకుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంజద్ బాషా పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట

కాశినాయన : మండలంలోని ఆకులనారాయణపల్లె ఎస్టీకాలనీ, నరసన్నపల్లె గ్రామంలో సీతారామ ఆలయంలో బుధవారం శ్రీమద్గణపతి, అన్నపూర్ణేశ్వరి, సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామి నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. విగ్రహమూర్తులకు వేదపండితులు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించి విగ్రహ, ప్రాణ ప్రతిష్ట చేశారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే డాక్టర్ సుధ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విశ్వనాధరెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

20న చలో విజయవాడ

ప్రొద్దుటూరు : భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కారం చేయాలని ఈనెల 20న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) ప్రొద్దుటూరు ఏరియా ప్రధాన కార్యదర్శి పూసల చిన్న ఓబన్న పిలుపునిచ్చారు. స్థానిక పీఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్ వద్ద బుధవారం భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చలో విజయవాడ కరపత్రాలను విడుదల చేశారు. ఎం.సుధాకర్, వెంకటకృష్ణ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న ఎమ్మెల్సీ

బ్రహ్మంగారిమఠం : మండలంలోని రేకులకుంటలో పంచాయతీ బాలాజీనగర్‌లో నూతనంగా నిర్మించిన సీతారామాలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహాలను వేద మంత్రాలతో వేదపండితు ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ హాజరయ్యారు. ఆలయ నిర్మాణానికి రూ.7లక్షలు విరాళంగా అందించారు.

పశు బీమా లక్ష్యం పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శారదమ్మ

పోరుమామిళ్ల : పశుబీమా పథకంలో పాడిగేదెలు, ఆవులతో పాటు ఎద్దులు, దున్నపోతులకు కూడా బీమా చేయించవచ్చని జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీఓ డాక్టర్ శారదమ్మ తెలిపారు. బుధవారం స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలలో ఏడీఓ డాక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పోరుమామిళ్ల, కాశినాయన, కలసపాడు మండలాల పశువైద్యులు, సహాయక సిబ్బంది, గోపాలమిత్రలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ శారదమ్మ మాట్లాడుతూ వైఎస్సార్ పశుబీమా పథకం ప్రాధాన్యత అందరూ తెలుసుకోవాలన్నారు. గొర్రెలు, మేకలకు 1 సంవత్సరం, 3 సంవత్సరాలకు బీమా చేయవచ్చన్నారు. నాటు పశువులకు రూ.15000/, ఫారం, ముర్రా, ఒంగోలు జాతి వాటికి రూ.30,000 వరకు బీమా చేయవచ్చన్నారు. గొర్రెలకు, మేకలకు రూ.6 వేలు చేయాలన్నారు. అదే సమయంలో సీజనల్ వ్యాధులు రాకుండా వ్యాక్సిన్ వేయించుకోవాలని పశు యజమానులకు వివరించాలన్నారు. సమావేశంలో పశువైద్యులు పాల్గొన్నారు.

నాణ్యతలేని ఎరువులు విక్రయిస్తే చర్యలు



తనిఖీలు నిర్వహిస్తున్న ఏడీఏ నాగరాజ

గోపవరం : నాణ్యతలేని ఎరువులను విక్రయిస్తే చర్యలు తప్పవని బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ హెచ్చరించారు. బుధవారం మండల పరిధిలోని భాగ్యలక్ష్మీ ఫర్టిలైజర్స్ ఎరువుల దుకాణాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన పరిమాణాలు కలిగిన ఎరువులను మాత్రమే రైతులకు విక్రయించాలని తెలిపారు. రైతులకు విక్రయించిన ఎరువులు, పురుగు మందులకు బిల్లులు ఇవ్వాలని సూచించారు. రైతులకు అందించే ఎరువులను ముందస్తుగా అగ్రిల్యాబ్‌లో పరీక్షించాక ఫలితాలనుసారంగా రైతులకు అందజేయాలని తెలిపారు. అనంతరం ఎరువుల స్టాకును పరిశీలించి తూకాలను తనిఖీ చేశారు.

పవిత్ర పుణ్యక్షేత్రంగా రూపుదిద్దుకోవాలి



చర్చి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్చి బిషప్ కార్డినల్ పూలఅంతోని, కడప మేత్రాసన పీఠాధిపతి గాలిబాలి

బద్వేలు అర్బన్ : బద్వేలులోని మదర్‌థెరిస్సా విచారణలో నూతనంగా నిర్మించిన పునీత పాదువాపురి అంతోని దేవాలయం అందరి సహకారంతో పవిత్ర పుణ్యక్షేత్రంగా రూపుదిద్దుకోవాలని ఆర్చి బిషప్ (హైదరాబాద్) మహాఘన కార్డినల్ పూలఅంతోని, కడప మేత్రాసన పీఠాధిపతి మహాఘన గాలిబాలిలు పేర్కొన్నారు. స్థానిక మైదుకూరు రోడ్డులో రూ.1.50 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన దేవాలయాన్ని బుధవారం వారు ప్రారంభించారు. అన్ని రకాల వసతులతో జిల్లాలో ఎక్కడాలేని విధంగా దేవాలయాన్ని నిర్మించారని, విచారణలోని గురువులను, సంఘస్తులను అభినందించారు. తొలుత ముఖ్యఅతిథులను స్థానిక ఫాతిమామాత చర్చి నుండి మదర్‌థెరిసా విచారణ వరకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. కార్యక్రమంలో పునీత మదర్ థెరిసా చర్చి విచారణ గురువులు లక్కినేనిఆరోగ్యరాజు, సహాయ గురువులు ఓసూరిజోసెఫ్, ఫాతిమా మాత విచారణ గురువులు ఫాదర్ విజయరావు, ఎంపీఎస్ఎస్ఎస్ డైరెక్టర్, మదర్‌థెరిసా విచారణ వ్యవస్థాపకులు ఫాదర్ తలారిబాలరాజు, కడప మేత్రాసన గురువులు దేవదాస్, ఆయా విచారణలలోని గురువులు, విశ్వాసులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేస్తాం



రైతుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డీఓ

పోరుమామిళ్ల : బెంగుళూరు నుంచి అమరావతికి ఏర్పాటు చేయనున్న 6 లైన్ల రోడ్డు నిర్మాణంలో మండలంలోని చెన్నారెడ్డిపేట, బొప్పాపురం గ్రామాలకు చెందిన 150 మంది రైతుల భూములు పోనున్నాయి. 3 సెంట్ల నుంచి ఎకరా వరకు ఒక్కో రైతుకు చెందిన పొలం మొత్తం 50 నుంచి 60 ఎకరాలు రోడ్డు నిర్మాణంలో పోనున్న నేపథ్యంలో బుధవారం ఆర్‌డీఓ ఆకుల వెంకటరమణ, తహసీల్దారు గంగయ్య రైతులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారం సరిపోదని ఎక్కువ కావాలని రైతులు పట్టుబట్టిన నేపథ్యంలో చెన్నారెడ్డిపేటలోనే రైతుల వద్ద సమావేశం ఏర్పాటు చేశారు. రైతులకు న్యాయం జరుగుతుందని భూమిలో చెట్లు, బోర్లు, ఇతర కట్టడాలు ఉంటే వాటికి కూడా నష్టపరిహారం అందుతుందన్నారు. వాగు పోరంబోకు, వంక పోరంబోకు, చెరువు, తిప్ప పోరంబోకుల్లో భూమి సాగు చేసుకుంటూ, ఆన్‌లైన్ చేయించుకున్నా పరిహారం అందదన్నారు. ఒరిజినల్ రిజిష్టర్ భూములకు, సాగులో ఉన్న డీకేటీ భూములకు మాత్రమే పరిహారం వస్తుందని స్పష్టం చేశారు. చెన్నారెడ్డిపేట వద్ద (పోరుమామిళ్ల - చెన్నారెడ్డిపేట మధ్యలో) బాక్స్ (జంక్షన్) ఏర్పాటు అవుతుందని దానికోసం భూమి తీసుకుంటున్నట్లు ఆర్‌డీఓ, తహసీల్దారు తెలిపారు. అధికారుల వివరణతో సంతృప్తి చెందిన రైతులు భూములు ఇచ్చేందుకు అంగీకరిస్తూ సంతకాలు చేశారు. ఈ సమావేశంలో సర్పంచ్ రఘునాథరెడ్డి, డీటీ సంజీవరెడ్డి పాల్గొన్నారు.

కౌమార దశపై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న చంద్రమౌలి

దువ్వూరు : మండలంలోని శ్రీలక్ష్మీ శ్రీనివాస డిగ్రీ కాలేజీలో బుధవారం కౌమార దశపై విద్యార్థులకు రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సాథి అడల్సెంట్ జిల్లా ప్రోగ్రాం అధికారి చంద్రమౌలి మాట్లాడుతూ విద్యార్థులు కౌమార దశలో వచ్చే వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. పచ్చబొట్లు వేయించుకోవడం వల్ల హెచ్ఐవీ సంక్రమించే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. విద్యార్థులు పోషకాహారం తీసుకోవాలని, ఆరోగ్య పరిశుభ్రత పాటించాలని చెప్పారు. స్త్రీలు బహిష్టు సమయంలో పరిశుభ్రతకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మానసిక ఉద్వేగానికి లోనుకాకుండా ప్రశాంతంగా ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ మల్లేశ్వరరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.